ప్రజాశక్తి
బుధవారం 5 ఏప్రిల్ 2023 5 అనంతపురం

ఏడాది పూర్తైనా.. ఎక్కడవేసిన గొంగళి అక్కడే..!

◆ సత్యసాయి జిల్లాలో మెరుగు పడని కార్యాలయ భవనాలు ◆ మౌలిక వసతులు శూన్యం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నూతన సత్యసాయి జిల్లా ఏర్పడి మంగళవారం నాటికి సరిగ్గా ఏడాది పూర్తి అయ్యింది. 2022 ఏప్రిల్ 4వ తేదీన పుట్టపర్తి కేంద్రంగా నూతన జిల్లాలో పాలన ప్రారంభమైంది. కొత్త జిల్లా ప్రారంభమైన సందర్భంగా పట్టణంలోని హనుమాన్ సర్కిల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి జిల్లా ఏర్పాటుపై అప్పటి మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, పివి.సిద్ధారెడ్డి తదితరులు ఆర్భాటంగా సత్యసాయి జిల్లా ఏర్పాటు గురించి గొప్పగా వివరించారు. ఇది జరిగి ఏడాది పూర్తయిన ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

పుట్టపర్తిలో సత్యసాయి ట్రస్టు సమకూర్చిన భవనాల్లో తాత్కాలిక కార్యాలయాలను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసుకోంది. సత్యసాయి విద్యాసంస్థ భవన సముదాయంలో కలెక్టరేట్, పర్తి ధర్మశాలలో ఎస్పీ కార్యాలయాలు కొంతవరకు మెరుగ్గా ఉన్నాయి. కొన్ని కార్యాలయాలు సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ఎదురుగా సత్యసాయి ట్రస్ట్ భవనాలు ఏర్పాటు కాగా, మరికొన్ని పెద్ద కమ్మవారిపల్లిలోని దీనజనోద్ధారణ సముదాయంలో ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇరుకైన గదుల్లో సుమారు 18 శాఖల కార్యాలయాలు ఉన్నాయి. ఇరుకైన గదుల్లో జిల్లాస్థాయి అధికారులు కాలం వెళ్లదీస్తున్నారు. కార్యాలయాలకు వెళ్లాలన్నా ప్రజలకు ఇబ్బందికరంగా ఉంది. అధికారులు కూడా చుట్టపుచూపుగా కార్యాలయాలకు వచ్చి వెళ్తున్నారు. ఇప్పటికీ కొన్ని శాఖలు ఉమ్మడి అనంతపురంలోనే కొనసాగుతున్నాయి. దేవాదాయశాఖ, కాలుష్య నివారణ మండలి శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ, యువజన సర్వీసులు తదితర శాఖలు పూర్తిగా నియమించలేదు. ఏడాది అయినా పలు శాఖల అధికారులకు సరైన కార్యాలయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. పేరుకు నూతన జిల్లా ఏర్పడిందే తప్పా, మౌలిక సదుపాయాలు లేక సరైన భవనాలు లేక అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తి వసతులతో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వసతులు లేకుండా పుట్టపర్తిలో ఉన్న ప్రభుత్వ భవన సముదాయాలు

కేతిరెడ్డి చుట్టూ యర్రగుట్ట వివాదం

◆ గూగుల్ మ్యాప్‌లోనూ ఆక్రమణ స్పష్టం
◆ టిడిపి మరోమారు ఆరోపణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చుట్టూ ఎర్రగుట్ట ఆక్రమణల వివాదం వీడటం లేదు. దీనిపై టిడిపి నేతల నుంచ మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా చేసిన యర్రగుట్ట ఆక్రమణల ఆరోపణలు ఆగడం లేదు. దీనికి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కూడా విజయవాడలో ఏకంగా చంద్రబాబు నివాసం కరకట్ట ఆక్రమణ అని ఇంటి వద్దకెళ్లి సోషియల్ మీడియాలో ఘాటుగా ఆరోపణలు చేశారు. దీనిపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మరో ఆరోపణ తాజాగా చేయడమే కాకుండా, ధర్మవరం చెరువు ఆనుకుని ఉన్న యర్రగుట్టను ఏ రకంగా ఆక్రమించారన్న దానిపై మరింత ఆధారాలతో మంగళవారం నాడు ప్రకటన విడుదల చేశారు. పాదయాత్ర ధర్మవరం నియోజకవర్గం దాటి వచ్చినా కేతిరెడ్డిపై ఆరోపణలపర్వం మాత్రం ఆగడం లేదు.

ఎర్రగుట్టపై 20 ఎకరాలు ఆక్రమించరంటూ తాజాగా విడుదల చేసిన ప్రకటనలో టిడిపి పేర్కొంది. రికార్డుల ప్రకారం ఎర్రగుట్టపై కేతిరెడ్డి తమ్ముడి భార్య గాలి వసుమతి పేరుతో 25.38 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. మిగిలిన 20 ఎకరాల కబ్జా చేసారని ఆరోపిస్తున్నారు. ఎర్రగుట్ట మొత్తం ఉన్నది 45.47 ఎకరాలు ఉన్నది గూగుల్ మ్యాప్స్ ద్వారా స్పష్టమవుతోందన్నారు. ఇందులో సర్వే నెంబరు 904, 905,908ల్లో 25.38 ఎకరాల కొనుగోలు చేసి ఉంటే తక్కిన భూమి ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. కొనుగోలు చేసామని చెబుతున్న 25.38 ఎకరాల్లోనూ ఎనిమిది ఎకరాలు వసుమతికి పిత్రార్జితంగా వచ్చినట్టు చూపించారని తెలిపారు. కర్నూలు జిల్లాకు చెందిన వసుమతికి ఇక్కడ పిత్రార్జితనంగా ఏ రకంగా వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. తక్కిన 20 ఎకరాలు ఆక్రమణ కాదా... దీనికి సమాధానం చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. ఇలా ఇద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ యర్రగుట్ట వివాదం చాలాకాలంగానే నడుస్తోంది. అంతకు మునుపు కూడా మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ సైతం దీనిపై ఆరోపణలు చేయడమే కాకుండా గ్రీన్ ట్రిబ్యూనల్‌కు ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. కేతిరెడ్డికి సంబంధించి రాజకీయపరమైన విమర్శలు, ఆరోపణలు ఏ రూపంలో వచ్చినా మొదటగా వస్తున్నది యర్రగుట్ట అంశమే కావడం గమనార్హం. ఇప్పుడు నారా లోకేశ్ ఆరోపణలతోపాటు, సెల్ఫీ ఛాలెంజ్‌తో ఈ అంశం రాష్ట్ర వ్యాప్తమైంది. ఇవి వచ్చే సార్వత్రిక ఎన్నికల వరకు ఇదే అంశం ప్రతిపక్ష పార్టీ సభ్యులకు అస్త్రంగా మారే అవకాశముంది. దీన్ని ఏ విధంగా కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తిప్పికొడతారో చూడాల్సి ఉంది.

ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న రైతుసంఘం నాయకులు

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-పుట్లూరు

అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈమేరకు మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిని మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చిలో కురిసిన భారీ వడగండ్ల వానకు వేలాది ఎకరాల్లో రైతులు పంటలు నష్టపోయారన్నారు. ఎకరాలో అరటి సాగుకు కనీసం రూ.1.30లక్షలు ఖర్చు అవుతుందన్నారు. ఈనేపథ్యంలో ఉల్లి, బొప్పాయి, కలింగర పంటలకు హెక్టారుకు రూ.15వేలు, మామిడి, చీనీ, నిమ్మ, సపోటా, జామ, దానిమ్మ, పంటలకు హెక్టారుకు రూ.25 వేలు, మొక్కజొన్నకు రూ.12,500 నష్టం జరిగినట్లు అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపడి బాధాకరమన్నారు. ఇలా అయితే రైతులు ఎలా వ్యవసాయం చేస్తారన్నారు. కావున బ్యాంకులు నిర్ణయించిన స్కేల్ అఫ్ ఫైనాన్స్ ఆధారంగా పంట నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అంతేగాకుండా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటల నష్టం అంచనా వేసే నిబంధనలను మార్చాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా కౌలు రైతుల పేర్లు ఈక్రాప్ బుకింగ్‌లో లేనందున పంట పెట్టుబడి నష్టపోయిన కౌలు రైతులకు పరిహారం వచ్చే అవకాశం లేకుండా పోతుందన్నారు. అలాగే సాంకేతిక కారణాలతో కొద్దిమంది రైతులు ఈక్రాప్ బుకింగ్ చేయించుకోలేదన్నారు. కావున ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి, కార్యదర్శి వెంకటచౌదరి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పెద్దయ్య, నాయకులు నాగభూషణం, పూలరంగడు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు

అనంత ప్రజల రుణం తీర్చుకుంటాం

అనంతపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేష్

◆ అధికారంలోకి రాగానే ఉద్యోగాల కల్పన
◆ బిసిలకు సముచిత స్థానం కల్పిస్తాం
◆ టిడిపి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించే బాధ్యత మీదే
◆ యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఎళ్లవేళలా టిడిపిని అదరిస్తున్న ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల అభివృద్ధికి బాటలు వేసి వారి రుణం తీర్చుకుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర 60వ రోజు మంగళవారం అనంతపురం నగరంలో సాగింది. పంగల్ రోడ్డులో ప్రారంభమైన యాత్ర విజయనగర కాలనీ, సంగమేశ్ సర్కిల్, పవర్ ఆఫీసు, బసవన్న కట్ట, సప్తగిరి సర్కిల్ మీదుగా అంబేద్కర్ బ్రిడ్జిపై నుంచి రుద్రంపేట బైపాస్ రోడ్డు, కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డు, బళ్లారి బైపాస్ రోడ్డు మీదుగా రాత్రికి ఎంవైఆర్ ఫంక్షన్ హాలు వరకు సాగింది. టిడిపి నాయకులు ఆయా కుడళ్లలో పెద్ద ఎత్తున లోకేష్‌కు స్వాగతం పలికారు. పాదయాత్రకు అనంతపురం నియోజకవర్గం ప్రజలు జన వాహినిగా హాజరై నీరాజనాలు పలికారు. తెలుగు మహిళలు హారతులు ఇచ్చి నియోజకవర్గంలోకి స్వాగతం పలికారు. టిడిపి అర్బన్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, జిల్లా అధ్యక్షులు కాలవశ్రీనివాసులు, జిల్లా టిడిపి ఇన్‌ఛార్జి బిటి.నాయుడులు లోకేష్‌కు ఘనస్వాగతం పలికారు. టీవీ టవర్ వద్ద ఆర్‌డిటి కార్యాలయాన్ని లోకేష్ సందర్శించారు. ఆర్‌డిటి ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, ఆర్‌డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్, ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, దశరథ్ తదితరులతో సమావేశమై ఆర్‌డిటి అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ప్రజలను ఉద్దేశించి లోకేష్ ప్రసంగించారు. రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు, చేస్తున్న పరిపాలనకు ఏ మాత్రం పొంతన లేదన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా అన్ని రంగాలనూ నిర్వీర్యం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలు, ముస్లిములు, మైనార్టీలు అన్ని రంగాల వారు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. అనంతపురం నియోజకవర్గంలో టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి మాత్రమే ఇప్పటికీ కన్పిస్తోందన్నారు.కొత్తగా జగన్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదన్నారు. ముఖ్యమంత్రితో నిధులు తెచ్చుకోలేని అసమర్థ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఆకాశంలో నడిచేవారని, యువగళం పాదయాత్ర ప్రారంభం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల తరువాత నేల గుర్తొకొచ్చిందన్నారు. ఇది ట్రైలర్ మాత్రమే అని, మునుముందు వైఎస్ఆర్‌సిపి వైఫల్యాలను మరింత ఎండగడతామన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గం అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి మరోసారి అసెంబ్లీకి పంపాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవడమే లక్ష్యం

వైకుంఠం ప్రభాకర్-చౌదరి

లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న ప్రభాకర్-చౌదరి

రాబోయే ఎన్నికల్లో నారా చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా కూర్చొబెట్టడమే లక్ష్యంగా ప్రతి తెలుగుదేశం పార్టీ నాయకుడు, కార్యకర్త పని చేస్తారని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా విజయనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ యువనేత నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్ర టిడిపి నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో టిడిపి హయాంలో చేసిన అభివృద్ధి పనులకు కూడా వైసిపి నాయకులు కమిషన్‌లు తిన్నారని విమర్శించారు. జాతీయ రహదారి తమ ప్రభుత్వంలోనే మంజూరు చేశామన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తే కేవలం కోవిడ్ సెంటర్‌గా వినియోగించారు తప్పా, పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించని దీన స్థితి నెలకొందన్నారు. అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు టిడిపి ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. అనంత కార్పొరేషన్‌లో అధికార పార్టీ కార్పొరేటర్‌లే కొట్టుకునే పరిస్థితి నెలకొందన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

సెంట్రల్ వర్శిటీ విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సి.రమేష్

ప్రజాశక్తి-గుంతకల్లు

సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థులపై వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సి.రమేష్ డిమాండ్ చేశారు. విద్యార్థులపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని నిరసిస్తూ మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు నోటికి రిబ్బన్లు కట్టుకుని మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా రాయలసీమ సంక్షేమం, అనంతపురం అభివృద్ధి కోసం విభజన హామీల్లో భాగంగా అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఎనిమిదేళ్లు పూర్తవుతున్నా కనీసం భవనం కట్టకపోవడం శోచనీయమన్నారు. సెంట్రల్ యూనివర్సిటీకి జంతులూరు దగ్గర కేటాయించిన స్థలంలో కాంపౌండ్ వాల్ కూడా నిర్మించలేందంటే ఎంత నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం అవుతుందన్నారు. ఇప్పటికే అద్దె భవనంలో ఉంటూ విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన వస్తోందన్నారు. మంచినీరు, భోజనం, వసతి వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో యూనివర్సిటీ అధికారులు, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అదేవిధంగా కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినర్ చేసిన తప్పుల వల్ల అనేకమంది విద్యార్థులు ఫెయిలయ్యారన్నారు. ఈనేపథ్యంలో యూనివర్సిటీలో జరిగే అన్యాయాలు, అక్రమాలను ప్రశ్నించే విద్యార్థులను వైస్‌ఛాన్సలర్ ఉద్దేశ పూర్వకంగా సస్పెండ్ చేయడం దౌర్భాగ్యమన్నారు. విసి దుర్మార్గమైన విధానాలను మానుకోవడంతోపాటు విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చరణ్, ప్రతాప్, చిరంజీవి, ఎస్ఎఫ్ఐ నాయకులు సుధాకర్, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

శింగనమల : సెంట్రల్ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలపై ప్రశ్నించిన విద్యార్థులను సస్పెండ్ చేయడం బాధాకరమని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు రాచేపల్లి సూర్యప్రకాష్, తరిమెల గిరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్శిటీలో కనీస మౌలిక వసతులు కల్పించడంలో విసి పూర్తిగా విఫలమయ్యారన్నారు. విభజన హామీల్లో ఒకటైన సెంట్రల్ యూనివర్శిటీ నిర్మాణంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి సెంట్రల్ వర్శిటీ విసిపై చర్యలు తీసుకోవడంతోపాటు విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గంగాధర్, వర్ధన్, బాబా ఫక్రుద్దీన్, సాయి, ఆదిత్య, అమీర్, తదితరులు పాల్గొన్నారు.

'యువగళం'తో వైసిపి వెన్నులో వణుకు

లోకేష్ పాదయాత్రను విజయవంతం చేద్దాం - టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు వస్తున్న ప్రజాధరణను చూసి వైసిపి ప్రభుత్వం వెన్నులో వణుకు పుడుతోందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వాల్మీకి దేవాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కర్షక, కార్మిక, ముఖ్యంగా యువత సమస్యలు తెలుసుకునేందుకు లోకేష్ పాదయాత్ర చేపట్టారన్నారు. ఆయన పాదయాత్ర ఉమ్మడి అనంతపురం జిల్లాలోకి అడుగుపెట్టగానే పసుపు సునామీ వచ్చిందన్నారు. ప్రజలు కూడా తమ ఇంటి వ్యక్తి వస్తున్నట్లు ఆప్యాయంగా స్వాగతం పలుకుతున్నారన్నారు. అంతేగాకుండా లోకేష్ పాదయాత్రతో కార్యకర్తలో నూతనోత్సాహంతోపాటు ధైర్యం వస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి అరాచకానికి చరమగీతం పాడి శింగనమల నియోజకవర్గంలో ఖచ్చితంగా టిడిపి జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాగా ఈనెల 6వతేదీన గార్లదిన్నె మండలం కోటంక వద్ద నియోజకవర్గంలోకి పాదయాత్ర అడుగు పెట్టనున్నట్లు తెలిపారు. కావున నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పసుపుల హనుమంతురెడ్డి, పొడరాళ్ల రవీంద్ర, దండువారిపల్లి ఆదినారాయణ, జొన్నా రామయ్య, కెకె అగ్రహారం రాము, ఓబుళపతి, గోవిందరెడ్డి, ఎస్.నారాయణస్వామి, పిట్టు రామకృష్ణారెడ్డి, కొత్తపల్లి గంపన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువగళం బ్రోచర్లను విడుదల చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ, నాయకులు

శింగనమల : మండలవ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తునా పాల్గొని నారా లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని రామాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. భారీ ఎత్తున మహిళలు, ప్రజలు పాదయాత్రకు వచ్చి తమ సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకొస్తున్నారన్నారు. వారందరికీ లోకేష్ భరోసా ఇస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, సీనియర్ నాయకుడు, లాయర్ ఈశ్వర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ చితంబరి దొర, చిదానందనాయుడు, బోయ సత్తి, మిట్ట పవన్, రాఘవరెడ్డి, మట్లగొంది సర్పంచి రమేష్, అట్టే రామాంజనేయులు, గుర్రం లక్ష్మీనారాయణ, అట్టే శ్రీనివాసులు, కొట్టాల సురేష్, నరసింహనాయుడు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాస్‌కాపీయింగ్‌పై చర్యలు తీసుకోవాలి

చూసి రాతలకు రూ.లక్షల వసూలు
డిఇఒ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా జరుగుతున్న ఓపెన్ ఇంటర్, పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ పాల్పడుతున్న సెంటర్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుళ్లాయిస్వామి, చిరంజీవి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్‌యాదవ్ మాట్లాడుతూ ఓపెన్ ఇంటర్, పదో తరగతి పరీక్షల్లో విచ్చలవిడిగా మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నా విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. పాస్ గ్యారెంటీ అని చెప్పి విద్యార్థుల నుంచి రూ.వేలు వసూలు చేస్తున్నా పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఒక్కో విద్యార్థి నుంచి అదనంగా రూ.1200 నుంచి రూ.2వేల వరకూ వసూలు చేస్తున్నారన్నారు. తక్షణమే అలాంటి సెంటర్లపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి రమణయ్య, నాయకులు ఆనంద్, వినోద్‌చంద్ర, సురేంద్ర, కిరణ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమాఖ్య నాయకులు గురు, అభి, వన్నూర్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల పరిధిలోని పంపనూరు గ్రామంలో మంగళవారం చేపట్టిన ఉపాధి హామీ పనులను కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పని దినాలు పెంపొందించి, సక్రమంగా పని చేసుకోవాలని సూచించారు. అలాగే కూలీలకు బిల్లులు త్వరగా పడేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా కూలీలు శాతం పెంచాలని ఎపిఒను ఆదేశించారు. ఇందుకు ఎపిఒ స్పందిస్తూ రైతుల పనులు ఎక్కువగా ఉండటంతో కూలీలు ఎక్కువగా ఆ పనులకు వెళ్తున్నారన్నారు. వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత కూలీల శాతం పెంచేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొంతమంది సచివాలయ సిబ్బంది ఉన్నత ఉద్యోగానికి శిక్షణ తీసుకునేందుకు లాంగ్ లీవ్‌లో వెళ్లారని సర్పంచి ఎర్రిస్వామి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి సత్తిబాబు, ఎపిఒ సుజాత, పంపనూరు సర్పంచి యడుమల ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

అభిమానాన్ని ఓట్ల రూపంలో చూపించాలి

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-పుట్లూరు

సిఎం జగనన్నపై ఉన్న మీ అభిమానం ఓట్ల రూపంలో చూపించాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కోరారు. మంగళవారం మండలం కేంద్రంలో నిర్వహించిన ఆసరా వారోత్సవాల్లో మహిళా సంఘాలకు మెగా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ పథకం నేరుగా మహిళల చేతుల్లో పడేలా జగనన్న అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల్లో 85శాతం మహిళలకే అందేలా చూస్తున్నట్లు తెలిపారు. ఒక్క ఆర్థిక ప్రతిపత్తి కల్పించడమే కాదు, రాజకీయాల్లో కూడా 50 శాతం మహిళా రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. చంద్రబాబులా మాటలు చెప్పేరకం కాదని,చేతల్లో చూపించిన ఏకైక వ్యక్తి మన జగనన్న అన్నారు. పేదవాళ్ల గురించి ఇంత జాగ్రత్తగా ఆలోచించే జగనన్న లాంటి ముఖ్యమంత్రి దొరకరన్నారు. కావున మరోసారి ఆయన్ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపిపి భూమిరెడ్డి గారి రాఘవరెడ్డి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు మహేశ్వర్‌రెడ్డి, ఓబులేష్, ఎంపిడిఒ యోగానందరెడ్డి, తహశీల్దార్ సుమతి, ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ఆరోగ్య కేంద్రంలో ఆశా డే

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలు మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ముందుగా హైరిస్క్ గర్భిణులను నిరంతరం పరీక్షలు చేయాలని సూచించారు. మామూలు గర్భిణికి అయితే నాలుగుసార్లు, హైరిస్క్ అయితే 4 నుంచి 6సార్లు పరీక్షలు చేయాలన్నారు. అలాగే కాల్షియం లోపం రాకుండా పూర్తిగా 360 మాత్రలు వాడాలన్నారు. పాలు, గుడ్డుతోపాటు బి.కాంప్లెక్స్ మాత్రలు, ఐరన్ ఫోలిక్ మాత్రలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దయాకర్, సబిహా సుల్తానా, ఎంపిహెచ్‌ఇఒలు నాగేశ్వరయ్య, మునాఫ్, సూపర్‌వైజర్ వెంకట్రత్నమ్మ, ఎఎన్‌ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతన్న డాక్టర్లు

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ మండలంలోని ఉద్దేహాల్ గ్రామానికి చెందిన దాదాపు 36 మంది హమాలీలు తహశీల్దార్ శ్రీనివాసులును కలిసి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 2016లో సర్వేనెంబర్ 245-బిలో ఉన్న 1.80 ఎకరాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు 39 ప్లాట్లు వేశారన్నారు. వాటిలో ఇద్దరికీ మాత్రమే ఇంటి పట్టాలు మంజూరు చేశారన్నారు. మిగిలిన వారికి ఇప్పటి వరకూ ఇంటి పట్టాలు ఇవ్వలేదన్నారు. మీరైనా స్పందించి తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో హమాలీలు హొన్నూరుస్వామి, పెన్నయ్య, రాము, ఆంజనేయ, పెద్దయ్య, కృష్ణ, తదితరులు ఉన్నారు.


తహశీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పిస్తున్న హమాలీలు

మహారాజశ్రీ ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు:కదిరి

O.S.No.585/2022

Between:

షేక్ ఫకృద్దీన్ ...వాది

మరియు

షేక్ మోదీన్ బీ మరియు ఇతరులు ...ప్రతివాదులు

To,

D6: షేక్ శర్ఫుద్దీన్ S/o ఫకృద్దీన్, డోర్‌నెం.9-2-239, రాణినగర్, పాతవూరు, అనంతపురం, అనంతపురంజిల్లా.

6వ ప్రతివాదికి దావా సమను

పై దావాలో పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తమై 02-05-2023 వ తేదికి వాయిదా వేసినారు. కావున మీరు 02-05-2023 వ తేదిన ఉదయం 10.30 గంIIలకు మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరు కావలయయును. అట్లు హాజరు గాని పక్షములో పై కోర్టువారు పై దావాను మీ పరోక్షమున తీర్మానము చేయుదురని తెలియజేయడమైనది.

(కోర్టువారి ఆదేశాల మేరకు)

స్థలం:కదిరి

వాయిదా తేది:02-05-2023.

ఎ.చంద్రశేఖర్ రెడ్డి, బి.ఎ., బి.ఎల్.
వాదితరపు వకీలు
కదిరి, శ్రీసత్యసాయి జిల్లా.

మహారాజశ్రీ ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు:కదిరి

I.A.No.852/2022 in O.S.No.585/2022

Between:

షేక్ ఫకృద్దీన్ ...పిటీషనర్/వాది

మరియు

షేక్ మోదీన్ బీ మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

To,

R6: షేక్ శర్ఫుద్దీన్ S/o ఫకృద్దీన్, డోర్‌నెం.9-2-239, రాణినగర్, పాతవూరు, అనంతపురం జిల్లా.

6వ రెస్పాండెంట్‌కు నోటీసు

పై అర్జీలో పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తమై 02-05-2023 వ తేదికి వాయిదా వేసినారు. కావున మీరు 02-05-2023 వ తేదిన ఉదయం 10.30 గంIIలకు మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరు కావలయయును. అట్లు హాజరు గాని పక్షములో పై కోర్టువారు పై అర్జీని మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టువారి ఆదేశాల మేరకు)

స్థలం:కదిరి

వాయిదా తేది:02-05-2023.

ఎ.చంద్రశేఖర్ రెడ్డి, బి.ఎ., బి.ఎల్.
పిటీషనర్ తరపు వకీలు
కదిరి, శ్రీసత్యసాయి జిల్లా.

డీఎస్సీ విడుదల చేయాలి

ఆర్‌పిఎస్ అధ్యక్షులు పోతుల నాగరాజు

అనంతపురం : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీఎస్సీ విడుదల చేసి నిరుద్యోగ యువతను ఆదుకోవాలని ఆర్‌పిఎస్ అధ్యక్షులు పోతుల నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డీఎస్సీ విడుదల చేయకపోవడంతో రాష్ట్రంలో నిరుద్యోగులకు న్యాయం జరగడం లేదన్నారు. ఇప్పటికే దాదాపు 8 లక్షల మంది టెట్ పాసై డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. అలాగే పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత ఉండటం వల్ల ఆరేళ్లుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే పరిస్థితి లేదన్నారు. అంతేగాకుండా వేలసంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడంతో గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి, దళిత, గిరిజన, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు చదువులకు దూరం అవుతున్నారన్నారు. జనాభా పెరిగేకొద్దీ ప్రభుత్వ పాఠశాలలను పెంచాల్సిన సమయంలో ఉన్న పాఠశాలలను తగ్గించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డీఎస్సీ విడుదల చేయడంతోపాటు పాఠశాలలను అన్నింటినీ తెరవాలని డిమాండ్ చేశారు.

పరీక్షలు లేని రోజు

ఒంటిపూట బడి నిర్వహించాలి : డిఇఒ

అనంతపురం సిటీ : జిల్లాలోని అన్ని ప్రయివేట్ పాఠశాలలు ఒంటిపూట బడి మాత్రమే నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం మంగళవారంలో ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. పదవ తరగతి పరీక్ష జరుగుతున్న కేంద్రాల్లో పరీక్షలు ఉన్న రోజు సెలవు ప్రకటించాలన్నారు. పరీక్షలు లేని రోజు మాత్రమే ఒంటిపూట బడి (ఉదయం 7:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు) నిర్వహించాలన్నారు. ఒంటిపూట బడి పని వేళలు తప్పకుండా పాటించాలని, లేకపోతే పాఠశాలల గుర్తింపుని రద్దు చేస్తామని హెచ్చరించారు.

చదువుతోపాటు నైపుణ్యాలు అవసరం

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ బి.ఈశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జెఎన్‌టియు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ బి.ఈశ్వర్‌రెడ్డి సూచించారు. స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్సు విభాగం ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం మంగళవారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి, అధ్యాపకులు నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలకు ఎంతో ముఖ్య పాత్ర ఉందన్నారు. ఇలాంటి ట్రైనింగ్ ప్రోగ్రాంల వల్ల ఉపాధ్యాయులు, తమకున్న విజ్ఞానాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా పెంపొందించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కోఆర్డినేటర్ పి.చెన్నారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల వల్ల నూతన అవిష్కరణలపై విద్యార్థులు, బోధనా సిబ్బందికి మంచి అవగాహన ఏర్పడుతుందన్నారు. అలాగే నూతన సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు అందించడానికి ఉపాధ్యాయులు తమకున్న పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుని విద్యార్థులకు బోధించాలని తెలిపారు. అనంతరం ఈ ప్రోగ్రాంలో పాల్గొన్న అధ్యాపకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

ఎస్సీ, ఎస్టీలపై దాడులు, హత్యలను నివారించాలి

ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్రవ్యాప్తంగా రోజురోజుకూ ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, హత్యలను ప్రభుత్వం వెంటనే నివారించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలనే లక్ష్యంగా చేసుకుని దాడులు, హత్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈనేపథ్యంలోనే బొందలవాడ రమాదేవి హత్య జరిగిందన్నారు. వెంటనే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా రమాదేవి హత్యకేసును విచారించి నిందితుడిని ఉరితీయాలని డిమాండ్ చేశారు. అలాగే కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. రమాదేవి హత్యపై స్పందించాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిని అడిగితే సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా వెళ్లిపోవడం సబబుకాదన్నారు. దళిత, గిరిజన మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. అదే అగ్రవర్ణాల మహిళలపై దాడులు జరిగితే ఏకంగా చట్టాలే తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దౌర్జన్యాలు, దాడులు, మానభంగాలు, హత్యలను ఆపకపోతే ఐక్యఉద్యమాలతో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఓబులేసు, పూసల మధు, వీరనారాయణ, రేకలకుంట రామాంజనేయులు, నాగలింగ, నాగరాజు, శ్రీరాములు, ఎర్రిస్వామి, రామకృష్ణ, వెంకటేష్, కొర్రపాడు నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎస్సీ, ఎస్టీ జెఎసి నాయకులు

కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి-పుట్లూరు

రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్షా ప్రాజెక్టులో పని చేస్తున్న వివిధ విభాగాల కాంట్రాక్టు ఉద్యోగులకు తక్షణమే వేతనాలు పెంచాలని ఎపి సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని ఎంఇఒ, పాఠశాలలు, కెజిబివిల వద్ద కాంట్రాక్టు ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్షా, కెజిబివిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మినియం ఆఫ్ టైం స్కేల్ అమలు చేసి వేతనాలు పెంచాలని, ఔట్సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోని మార్చాలని, ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దు చేసి, ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చెచేయాలని, కరువు భత్యం, ఇంటి అద్దె సౌకర్యం, గ్రాట్యుటీ కల్పించాలని, ఇపిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేయాలని, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, సీనియారిటి ప్రాతిపదికన అన్ని విభాగాలకు వార్షిక ఇంక్రిమెంట్ అమలు చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవుల మంజూరుతోపాటు మెరుగైన హెల్త్ స్కీం అమలు చేయాలని, పని భారం తగ్గించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలకు వర్తింపజేయాల కోరారు. అలాగే బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని, ఎక్స్‌గ్రేషియా 20 లక్షలకు పెంచాలని, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియమాలు చేపట్టాలని, మహిళా ఉద్యోగులకు 5 స్పెషల్ లీవులు మంజరు చేయాలని, 11వ పిఆర్‌సి ప్రకారం లీవ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిటిఇఒ అశ్వర్థ, ఎంఐఎస్ లక్ష్మీదేవి, మెసెంజర్ శ్రీరాములు, సిఆర్‌పి వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

నాసా స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్టులో 'శ్రీ చైతన్య' విజయభేరి

ప్రజాశక్తి-అనంతపురం

అమెరికా నాసా వారి ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్-2023లో శ్రీ చైతన్య పాఠశాల వరుసగా పదవ సంవత్సరం వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచింది. ప్రపంచం నలుమూలల నుంచి సుమారు 30కిపైగా దేశాల విద్యార్థులు పాల్గొనగా శ్రీ చైతన్య విద్యార్థులు దేశాన్ని నెం.1గా నిలబెట్టారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంపికైయినా 138 ప్రాజెక్టుల్లో 89 ప్రాజెక్టులు భారతదేశం నుంచి ఎంపికవ్వడం గర్వకారణం. వీటిలో కూడా 54 ప్రాజెక్టులు ఒక్క శ్రీచైతన్య నుంచే ఎంపికయ్యాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి 18 ప్రాజెక్టులు ఎంపికవ్వగా అనంతపురం జోన్ నుంచి గుంతకల్లు బ్రాంచికి చెందిన ఒక ప్రాజెక్టు ఎంపికైనట్లు పాఠశాల ఎజిఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కమ్మ భవన్ సమీపంలోని శ్రీ చైతన్య సిఅండ్ఎం బ్యాచ్ డేస్కాలర్ క్యాంపస్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎజిఎం మాట్లాడుతూ పటిష్టమైన ప్రణాళిక, అత్యంత అనుభవం కలిగిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు కష్టపడి ప్రాజెక్టులు సిద్ధం చేసి నాసా వారికి పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు విశ్వనాథ్, వీరేష్‌బాబు, రాజేష్‌బాబు, నారాయణస్వామి, కోఆర్డినేటర్లు రాధాకృష్ణనాయుడు, తిరుమలేష్, శ్రీనివాస్, డీన్ జాన్ విన్సంట్, నాసా ఇన్‌ఛార్జి మస్తాన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య పాఠశాల సిబ్బంది

దూరపు జిల్లాల బదిలీలు ఆపాలని వినతి

ప్రజాశక్తి-పుట్లూరు

జిల్లాలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న టిఎలు, కంప్యూటర్ ఆపరేటర్లను దూరపు జిల్లాల బదిలీలను ఆపాలని మండలంలోని పలువురు టిఎలు కోరారు. ఈమేరకు మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిని మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న 88 మందిని దూర ప్రాంతాలైన అనకాపల్లి, కాకినాడ, విశాఖపట్నం, అరకు, పల్నాడు, అన్నమయ్య వంటి జిల్లాలకు బదిలీ చేశారన్నారు. ఇప్పటికే చాలీచాలని వేతనాలతో జీవిస్తున్న తమను అంత దూర ప్రాంత జిల్లాలకు బదిలీ చేయడంతో మరింత ఇబ్బందులు పడతామని తెలిపారు. కావున సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో టిఎలు విజయ్, నాగేందర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, బాబా, కంప్యూటర్ ఆపరేటర్లు గంగాధర్, నాగేంద్ర, తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న ఉపాధి హామీ టిఎలు, కంప్యూటర్ ఆపరేటర్లు

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న జైన్‌లు

అనంతలో జైనుల ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం

మహావీర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని సుభాష్‌రోడ్‌లో జైన్‌లు ర్యాలీ నిర్వహించారు. టవర్ క్లాక్ మీదగా సప్తగిరి సర్కిల్, కమలానగర్‌లోని జైన్ ఆలయం వరకూ సాగింది. మహావీర్ జయంతి సందర్భంగా జైన్‌లు పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. అందులో భాగంగా గోశాలలో ఆవులకు మేతను వితరణ చేశారు. ఈ ర్యాలీలో దాదాపు 40 జైన్ కుటుంబాల జైన్ కులపెద్దలు, ప్రముఖులు సురేష్ కొఠారి, అశోక్ కొఠారి, అశోక్, గోరాదేవి, చాంద్, ప్రకాష్ షేత్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో మహిళ మృతి

మృతిచెందిన షంషాద్

గుత్తి : పట్టణంలోని ఈద్గా మైదానం సమీపంలో నివాసం ఉండే షంషాద్ (55) మంగళవారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు రోడ్డులో బజ్జీలు విక్రయిస్తూ జీవనం కొనసాగించే షంషాద్ ఇంట్లో ఫ్యాన్ స్విచ్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, వైసిపి నాయకులు ఆసుపత్రిలో ఉన్న షంషాద్ మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రూ.3.50 లక్షల అపహరణకు యత్నం

నిందితున్ని పట్టుకుని పోలీసులకు అప్పగింత

గుత్తి : బ్యాంకు నుంచి డబ్బులు డ్రా చేసుకుని ద్విచక్ర వాహనంలో పెట్టుకుని ఇంటికి వెళ్తుండగా ఆ సొమ్మును ఓ యువకుడు చోరీ చేసేందుకు యత్నించగా అప్రమత్తమై నిందితున్ని పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన గుత్తిలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన షేక్ బాషా అనంతపురం రోడ్డులోని ఓ జాతీయ బ్యాంకు నుంచి రూ.3.50 లక్షలు డ్రా చేసుకుని ద్విచక్రవాహంలో పెట్టుకుని ఇంటికి బయలుదేరాడు. అయితే తాడిపత్రి రోడ్డులో తన స్నేహితుడు దుకాణం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆపి దిగుతుండగా వెంబడించిన గుర్తుతెలియని దుండగుడు ద్విచక్ర వాహనంలోని బ్యాగ్‌లో ఉన్న నగదు దోచుకునేందుకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన బాషా అడ్డుకోవడంతో దుండగుడు డబ్బాలోని మత్తుమందుని చల్లేందుకు యత్నించాడు. స్థానికులతో కలిసి బాషా దొంగను పట్టుకుని దేహశుద్ధి చేశారు. పోలీసులకి అప్పగించారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన దుండగుడుగా పోలీసులు తెలిపారు.

నాటుసారా పట్టివేత

గుత్తి : పట్టణ శివారులోని టోల్‌ప్లాజా వద్ద మంగళవారం 60 లీటర్ల నాటుసారాను సెబ్ అధికారులు పట్టుకున్నారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రోల్లపాడు తండాకు చెందిన గోవిందనాయక్ ద్విచక్ర వాహనంలో నాటుసారా తరలిస్తుండగా సెబ్ సీఐ బి.వరలక్ష్మి ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు. నాటసారా విక్రయిత నరేష్ చేసి అతని వద్ద ఉన్న నాటుసారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ మహమ్మద్ అలీ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

'యువగళం' ఏర్పాట్లు పరిశీలన

శింగనమల : త్వరలో మండల కేంద్రం మీదుగా సాగనున్న నారా లోకేష్ యువగళం పాదయాత్రకు సంబంధించిన ఏర్పాట్లను టిడిపి నాయకులు మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి అమర్‌నాథ్‌రెడ్డి హాజరై పాదయాత్ర సభాస్థలి, బస చేసే ప్రాంతాలు, రూట్ మ్యాప్‌ను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, అలం నరసానాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెస్ రాజు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, నాయకులు సి.వెంకటేష్, దాసరి గంగాధర్, పార్లమెంటు కోశాధికారి శ్రీనివాసులుగౌడ్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బండి పరుశురాం, బిసి సెల్ అధికార ప్రతినిధి బండి పరుశురాం, వాణిజ్య విభాగం కార్యదర్శి డేరంగుల శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జేఎన్‌టియు పరిధిలో నిర్వహించిన బీ.టెక్ 2వ సంవత్సరం, 1వ సెమిస్టర్ (ఆర్.20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష పలితాలను మంగళవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ బి.చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ http://jntuaresults.ac.inను సంప్రదించాలని కోరారు.

వసతి గృహాల తనిఖీ

గుత్తి : పట్టణంలోని ప్రభుత్వ వసతి గృహాలను మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ వీవీఎస్ మూర్తి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వసతి గృహాల్లో రికార్డులను పరిశీలించి సదుపాయాలు, విద్యార్థుల ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. ముందుగా మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో నాడు-నేడు, హౌసింగ్, వార్డుల్లోని రోడ్లు, డ్రెయినేజీలు ప్రోగ్రెస్ పిపిటిలపై వివరాలు అడిగారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాసులు, మేనేజర్ మురళీధర్, ఎఇ శరత్ చంద్ర, సచివాలయ క్లర్క్ ఇమామ్ హుసేన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రంగయ్య, టిపిఎస్ అబ్దుల్ సత్తార్, ఆర్ఒ వెంకటరెడ్డి, ఆర్ఐలు షేక్షావలి, సికె రామాంజనేయులు, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ తమీమ్, బిల్ కలెక్టర్ చంద్రశేఖర్, డిపిఒ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జాతరలు

బెలుగుప్ప: మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో మంగళవారం త్రిమూర్తులు, కొల్లాపూర్, మారెమ్మ, కుంటి మారెమ్మ అమ్మవార్ల జాతరలను వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం పొట్టేళ్లను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.

ఆపరేటర్ కోర్సుకు దరఖాస్తు చేసుకోండి

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని బోరంపల్లి గ్రామంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో అసోసియేట్ డేటాఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసి 17-45 సంవ్సరాల వయస్సు ఉన్న వారందరూ దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. రెండు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కావున అర్హులైన అభ్యర్థులు ఈనెల 11వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

కళ్యాణదుర్గం : జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కంబదూరు మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఛైర్‌పర్సన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపి తలారి రంగయ్య నిధులతో జిల్లాలోని నార్పల, కనగానపల్లి మండల కేంద్రాల్లో నూతన గ్రంథాలయ భవనాలకు రూ.40లక్షలు చొప్పున మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే బ్రహ్మసముద్రం మండల కేంద్రంలో రూ.30 లక్షలతో గ్రంథాలయ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఆశయాలకు తమవంతుగా అహర్నిశలు కష్టించి అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ప్రమాద బాధితులకు పరామర్శ

నార్పల : రోడ్డు ప్రమాదంలో గాయపడిన నార్పల మండలం నడిమిదొడ్డి గ్రామానికి చెందిన పలువురు కూలీలను టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకటనరసానాయుడు పరామర్శించారు. మంగళవారం శింగనమల మండలం కొరివిపల్లి సమీపంలో కరివేపాకు కోసేందుకు కూలీలతో వెళ్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. దీంతో కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు అనంతపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఆలం వెంకట నరసానాయుడు ఆసుపత్రికి వెళ్లి గాయపడిన కూలీలను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.